సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్

విశాఖ: ఏయూ ఫార్మసీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ.కృష్ణమంజరి పవార్‌కి ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది.



యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు

విశాఖ: ఈనెల 7, 8 తేదీల్లో జరిగే యూపీఎస్సీ కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.



అభినందనలు

విశాఖ: ఏయూ ఓఎస్డీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య వి.కృష్ణమోహన్‌ను ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, ఆచార్యులు అభినందించారు.

ఆరోగ్యంగా.. ఆనందంగా..



అనకాపల్లిలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

వాడవాడలా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదల పాలిట వరంలా మారాయి. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక.. ప్రభుత్వ ఆస్పత్రుల చుట్టూ తిరగలేక ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడుతున్న సామాన్యులు ఇప్పుడు స్పెషలిస్టు వైద్యంతో ఊరడిల్లుతున్నారు. పరీక్షలు జరిపి, మందులు ఉచితంగా అందించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి న్యూస్ నెట్‌వర్క్



బయ్యవరంలో మహిళను పరీక్షిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

న్యూస్‌రీల్

నేడు మాకవరపాలెంలో స్పందన

తుమ్మపాల: ఈ నెల 6వ తేదీన మాకవరపాలెంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

నర్సీపట్నం కమిషనర్ రవిబాబు బాధ్యతల స్వీకారం



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పూడి రవిబాబు

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పూడి రవిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత కమిషనర్ కనకారావు నుంచి ఆయన చార్జి తీసుకున్నారు. కార్యాలయ సిబ్బంది రవిబాబుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ కమిషనర్‌గా పని చేసినందున మున్సిపాలిటీపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సచివాలయాల్లో స్పందన కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. వార్డు సందర్శన కార్యక్రమం ద్వారా వార్డుల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానన్నారు.

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీతో ఒప్పందం



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెంటర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్)తో గురువారం ఎంవోయూ కుదుర్చుకుంది. రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన వివిధ ఆహార ఉత్పత్తులకు జీఐ ట్యాగ్‌ల దాఖలను ప్రోత్సహించనుంది. ఆహార ఉత్పత్తికి సంబంధించి మద్దతు, నైపుణ్యం, వనరుల మార్పిడికి సహకారం అందించనుంది. ఇందుకోసం సెమినార్లు, ఎగ్జిబిషన్లు, సింపోజియంలు, వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడం కోసం ఈ ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ జోగినాయుడు, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు చిరంజీవి చౌదరి, ఐఎఫ్ఎస్ ప్రిన్సిపాల్ సెక్రటరీ (అగ్రికల్చర్ మార్కెటింగ్, కోఆపరేటివ్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్) సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకొన్నారు.

పోషకాహారంతోనే అసలైన ఆరోగ్య రక్ష



శిబిరంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్

- 'సురక్ష' శిబిరాల్లో పౌష్టికాహార అవగాహన శిబిరాల ఏర్పాటు
- పోషక విలువలు గల ఆహారం ఆవశ్యకతపై వివరణ
- ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఒకపక్క వైద్యులు పరీక్షలు జరిపి మందులు ఉచితంగా అందిస్తుండగా.. మరోపక్క అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార అవగాహన శిబిరాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు.. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాధాన్యం వివరిస్తున్నారు. పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, వివిధ రకాల ఆహార పదార్థాలు ప్రదర్శించి సమగ్రంగా అవగాహన కలిగిస్తున్నారు. గురువారం వరకు జిల్లాలో నాలుగు రోజులపాటు జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతి చోటా పౌష్టికాహార అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంగా ఉపయోగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రదర్శిస్తున్నారు. వీటిలో రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో వంతున బెల్లం, ఖర్జూరం, వేరుశెనగ చక్కీలు ఉన్నాయి. అలాగే ఐసీడీఎస్ తరపున అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అదనపు ఆహారంగా మూడు కిలోల పోషక విలువలు కలిగిన బియ్యం 3 కిలోలు, ఆయిల్ లీటర్, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లను, పిల్లలకు ఆహారంగా బాలామృతం ప్యాకెట్‌ను సరఫరా చేస్తున్నారు. వీటి గురించి శిబిరంలో తెలియజేస్తున్నారు. ప్రొటీన్ అందించే పెసలు, ఉలవలు, వేరుశెనగ, బొబ్బర, కొమ్ము శెనగలు, మినుములు వంటి పప్పు దినుసులు, బియ్యానికి ప్రత్యామ్నాయమైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, ఎర్ర గోధుమ వంటి చిరు ధాన్యాలు, సీ విటమిన్, ఆరోగ్యాన్ని అందించే జామ, ద్రాక్ష, బత్తాయి, వెలగ, బొప్పాయి, నిమ్మ, ద్రాక్ష, సీతాఫలం తదితర పండ్లు, పోషక విలువలు కలిగిన అనబ, మొక్కజొన్న, వంకాయ, టమాటా, క్యారెట్, బీట్రూట్, బరబాటి, మునగ, చేమ, కాకర వంటి కూరగాయలు, రక్తహీనతను నివారించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే తోటకూర, పాలకూర, బచ్చలి, గోంగూర, మునగ, పుదినా, కొత్తిమీర తదితర ఆకు కూరలు ప్రదర్శిస్తున్నారు.

ఆహా.. ఏమి రుచి!

పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. అటుకుల పులిహోర, బాలామృతంతో తయారు చేసే లడ్డు, బిస్కెట్లు, గులాబీ పువ్వులు, కేకు, ఆవిరి కుడుములు, రాగి పిండితో తయారు చేసే హల్వా, పకోడి, జంతికలు, అంబలి, లడ్డు, సున్ని ఉండలు, రాగి సంగటి, బూందీ, కేరట్ హల్వా, ఉలవ ఉండలు, పాలతో తయారు చేసే జున్ను తదితర వంటకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శన తిలకించడానికి వచ్చే బాలింతలు, గర్భిణులకు వీటి ఆవశ్యకతను వివరించి వాటిని రుచి చూపించి, తయారీపై పూర్తి అవగాహన కలిగిస్తున్నారు. ఇలాంటి శిబిరాలు ప్రజలు ఎంతో ఉపయోగకరమని, ఆరోగ్య సురక్ష సేవల కోసం వచ్చే వారికి ఈ విషయాలను వివరించడం ఎంతో ఆనందంగా ఉందని బయ్యవరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత ఆదిలక్ష్మి 'సాక్షి'కి చెప్పారు. ప్రతి రోజూ పప్పుతోపాటు ఏదో ఆకు కూర కలిపి వండి తినాలని, దీనివల్ల ప్రొటీన్ అందడంతోపాటు ఆరోగ్యవంతంగా ఉండటానికి దోహదం చేస్తుందని వివరిస్తున్నామన్నారు. బాలామృతం పిల్లలకు సెరలాక్‌లా పనిచేస్తుందని, రోజుకు వంద గ్రాముల వంతున పిల్లలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గతంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో కూడా గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన కలిగించామన్నారు.



బయ్యవరంలో నిర్వహించిన పౌష్టికాహార అవగాహన శిబిరం



పలు రకాల పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన



ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల ప్రదర్శన

86 నర్సు పోస్టులకు 9,100 దరఖాస్తులు

మహారాణిపేట (విశాఖ): స్టాఫ్ నర్సు పోస్టుల దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా.. జోన్-1 పరిధిలో మొత్తం 86 నర్సు పోస్టుల కోసం గత నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 9,100 మంది గడువు ముగిసే సమయానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలన చేస్తున్నామని.. త్వరలోనే అర్హుల జాబితాను విడుదల చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి వెల్లడించారు.

ఆధిక్యంలో ఆన్ష్, ప్రతీతి



పోటాపోటీగా ఆడుతున్న చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: అండర్-11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్‌లో ఆన్ష్, ప్రతీతి ఆధిక్యంలో కొనసాగుతున్నారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఎనిమిదో రౌండ్ పోటీలు జరిగాయి. ఓపెన్‌లో ఏడున్నర పాయింట్లతో ఆన్ష్ (మహారాష్ట్ర), ఏడేసి పాయింట్లతో ఆయాన్(చండీగఢ్), సంజయ్(తమిళనాడు), మేహుల్ సోంధీ(ఢిల్లీ), ఆరవ్(తమిళనాడు) తొలి ఐదు స్థానాల్లో నిలిచి తొమ్మిదో రౌండ్‌కు సిద్ధమయ్యారు. బాలికల విభాగంలో ఏడున్నర పాయింట్లతో ప్రతీతి(కర్ణాటక), ఏడేసి పాయింట్లతో హాన్య షా(గుజరాత్), త్రిపురాంబిక(ఆంధ్రప్రదేశ్) తొలి మూడు స్థానాల్లో నిలిచి తొమ్మిదో రౌండ్‌కు చేరుకున్నారు. మొత్తంగా 11 రౌండ్ల పాటు ఈ పోటీలు జరగనున్నాయి.



అంతరిక్ష పరిశోధనలపై పెరిగిన ఆసక్తి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

బీచ్‌రోడ్డు: చంద్రయాన్-3 విజయం భారతీయుల్లో కొత్త శక్తిని, అంతరిక్ష పరిశోధనలపై యువతలో ఆసక్తిని కలిగించిందని డీసీపీ-2 కె.ఆనందరెడ్డి అన్నారు. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్), రఘు విద్యా సంస్థలు సంయుక్తంగా గురువారం బీచ్‌రోడ్డులో వాక్ ఫర్ స్పేస్ వీక్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద డీసీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ అద్భుత విజయాలు సాధిస్తోందన్నారు. భవిష్యత్‌లో దీనిని మరింత అభివృద్ధి చేసి, ముందుకు నడిపించే బాధ్యత యువత తీసుకోవాలన్నారు. అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంతోనే మానవ అభివృద్ధి సాకారమవుతుందన్నారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ షార్, ఇస్రో నిర్వహిస్తున్న నాలుగు రోజుల ప్రత్యేక కార్యక్రమాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షార్, ఇస్రో శాస్త్రవేత్తలు, రఘు విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పోలీస్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్న ర్యాలీ ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగింది.

పలు రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం (విశాఖ) : పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. బాలాసోర్ -హల్దిపడ మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం మరికొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్టు తెలిపారు. హౌరాలో గురువారం ఉదయం 8.30గంటలకు బయల్దేరవలసిన హౌరా-సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12గంటలకు బయల్దేరింది. షాలిమార్‌లో గురువారం ఉదయం 11.25గంటలకు బయల్దేరవలసిన షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.25గంటలకు బయల్దేరింది. హౌరాలో గురువారం సాయంత్రం 5.40 గంటలకు బయల్దేరవలసిన హౌరా- తిరుచ్చిరాపల్లి (12664) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8.30గంటలకు బయల్దేరింది. బాలాసోర్-హల్దిపడ స్టేషన్ల మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఆయా స్టేషన్‌లలో శుక్రవారం, శనివారం బయల్దేరవలసిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేశారు.

మత్స్యకారులకు రాయితీపై ఇంజన్లు, బోట్లు

జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు



సహకార సంఘాల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న గురునాథరావు

నక్కపల్లి: మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం రాయితీపై ఇంజన్లు, బోట్లు సరఫరా చేస్తోందని ఆప్కాఫ్ వైస్ చైర్మన్, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని మత్స్యకార సొసైటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలు విలువైన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. జిల్లాకు వంద యూనిట్లు మంజూరు కాగా, ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇస్తోందని, మిగిలిన 25 శాతం లబ్ధిదారుడు వాటాగా చెల్లించాలన్నారు. రిజర్వాయర్లలో వేటసాగించే మత్స్యకారులకు రాయితీపై తెప్పలు అందజేస్తున్నామన్నారు. వేట నిషేధ సమయంలో రూ.10 వేల సాయాన్ని అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారం కోసం నెలల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. పచ్చచొక్కాలు తొడిగిన వారికే పరిహారం ఇచ్చేవారని, సగం మందికి వచ్చేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఆ సమస్య లేదన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ రూ.24 కోట్లతో ఫిష్‌ల్యాండింగ్ సెంటరు, మిని జెట్టీ నిర్మాణ పనులు నక్కపల్లి మండలంలో త్వరలో ప్రారంభమవుతాయన్నారు. జెట్టీ నిర్మాణం పూర్తయితే ఇక్కడ మత్స్య సంపదను మార్కెటింగ్ చేసుకోవడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీతోపాటు డీసీసీబీ చైర్మన్ పదవిని మత్స్యకారులకు కేటాయించారని, నక్కపల్లి మండల జెడ్పీటీసీ పదవి సైతం ఇచ్చారన్నారు. అనంతరం నియోజకవర్గానికి ఫిష్‌ల్యాండింగ్ సెంటరు మంజూరు చేయించిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మత్స్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లాలో సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

స్టార్టప్ స్టార్స్

- మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సుకు పలు జిల్లాల నుంచి ప్రతినిధుల హాజరు
- ఈ సదస్సు ఎంతో ఉపయుక్తమని ఉద్ఘాటన

సాక్షి, విశాఖపట్నం: మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సుకు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్ర స్థాయి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం ప్రారంభమైంది. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అధికారులు వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. స్టార్టప్ కంపెనీల నిర్వాహకులు ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. విజయగాథలను వివరించారు. సదస్సులో పాల్గొన్న మహిళా పారిశ్రామికవేత్తలు గతంలో ఈ తరహా సదస్సులు జరగలేదని, స్టార్టప్ కంపెనీల నిర్వాహకులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. సదస్సులో పాల్గొన్న వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

గత ప్రభుత్వాలకు భిన్నంగా..



నేను తిరుపతి నుంచి ఈ సదస్సుకు వచ్చాను. మా స్టార్టప్ కంపెనీ ద్వారా స్కూళ్లకు యూకేలో మాదిరిగా సర్వీసులను ప్రొవైడ్ చేస్తున్నాం. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నిర్వహించిన ఈ సదస్సులో ఎన్నో విషయాలు తెల్సుకున్నాను. ఈ సదస్సు స్టార్టప్ కంపెనీల నిర్వాహకులకు మంచి ప్లాట్‌ఫాం. మాలాంటి వారెందరికో ప్రయోజనం చేకూరుతుంది. మునుపటి ప్రభుత్వాల్లా కాకుండా ఈ ప్రభుత్వం సదస్సుల్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు కార్యాచరణలో పెడుతోంది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మేం ఎంఓయూ కుదుర్చుకున్నాం. – జి.శశిరేఖ, అడ్వెంచర్ స్కూల్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి



ఎంవోయూ పత్రాలను ప్రదర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఐటీ కార్యదర్శి కోన శశిధర్, ఏపీఐఎస్ సీఈవో అనిల్‌కుమార్, అడ్వెంచర్ స్కూల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి శశిరేఖ

ఆలోచనల ఆచరణకు దోహదం



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సు వల్ల సాటి స్టార్టప్ కంపెనీల నిర్వాహకులు ఒకరికొకరు ఆలోచనలు పంచుకోవడానికి, అవి సరైన రీతిలో కార్యరూపం దాల్చడానికి, నైపుణ్యాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుంది. నెట్‌వర్క్ విస్తృతం అవుతుంది. మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న సహకారం, పథకాలు, వాటిని ఎలా పొందవచ్చో తెలుస్తుంది. ఆధునిక సాంకేతికత, గ్లోబల్ పొజిషనింగ్ గురించి మరింత అవగాహన కలుగుతుంది. కోవిడ్ సెకండ్ వేవ్ తర్వాత వచ్చిన ఆలోచనతో స్టార్టప్ కంపెనీ ద్వారా మెడెక్స్ ఫోర్స్ పేరిట మెడికల్ యాప్ ద్వారా నర్సింగ్ సేవలందిస్తున్నాం. – శ్రీనిజ రామచంద్ర, ఆర్‌క్యూబీ టెక్నాలజీస్, విశాఖపట్నం

ఔత్సాహికులకు దిశానిర్దేశం



నేను విజయనగరంలో ఆన్‌లైన్ ద్వారా మరింత మెరుగ్గా టీచింగ్ ఎలా చేయాలన్న దానిపై సాఫ్ట్‌వేర్ ప్రొడక్టును తయారు చేశాను. ఇది మంచి ఫలితాలనిస్తోంది. గూగుల్‌కు అంబాసిడర్‌గా నూ ఉన్నాను. గూగుల్ తరపున 'స్టార్టప్ సక్సెస్ డేస్'కు పనిచేస్తున్నాను. ఈ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు ద్వారా స్టార్టప్ కంపెనీలకు ఫండింగ్, ఎవరితో సంప్రదించాలి? సరైన మార్గంలో వెళ్తున్నామా? వంటి ఎన్నో అంశాలను నిపుణుల ద్వారా తెలుసుకునే వీలు కలిగింది. ఈ సదస్సు కొత్తవారితోపాటు ప్రస్తుతం నడుపుతున్న వారికీ ఎంతో ఉపయోగపడుతుంది. – వేమూరి ఉషా రమణి, ఫౌండర్, 'గురుజాడ' ఐటీ సొల్యూషన్స్, విజయనగరం

ఏపీఐఎస్‌తో ఎంఓయూ



మహిళలు, ఇతరులు నడుపుతున్న స్టార్టప్ కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలే కాదు.. సాధించిన విజయాలను, నిర్వాహకుల అనుభవాలను తెలుసుకునే వీలు ఈ సదస్సు ద్వారా కలిగింది. అంతేకాదు.. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు మెలకువలపై అధికారులు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఇలాంటి సదస్సులు స్టార్టప్ కంపెనీల నిర్వాహకులకు ఎంతో ప్రయోజనకరం. ఈ రోజు సదస్సులో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్)తో హెడ్ స్టార్ట్ నెట్‌వర్క్ ఫౌండేషన్ పేరిట ఎంఓయూ కుదుర్చుకున్నాం. – అశ్వథి వేణుగోపాల్, అవసర్‌శాల స్టార్టప్ కంపెనీ, గుంటూరు

బాలకార్మికుడితో పనిచేయిస్తున్న యజమానిపై కేసు

బుచ్చెయ్యపేట: స్థానిక సీతయ్యపేటలో బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై కార్మికశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 2 నుంచి 10 వరకు వీధి బాలల గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నారు. గురువారం చోడవరం కార్మికశాఖ, పోలీసులు, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో వీధి బాల గుర్తింపు జరిపారు. సీతయ్యపేటలో అభిషేక్ ఫుడ్ ట్రేడర్స్‌లో పని చేస్తున్న 14 ఏళ్ల లోపు వయసున్న బాలుడిని గుర్తించి, షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా బడికి వెళ్లాల్సిన పిల్లల్ని పనిలోపెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు. ఇలాంటి వారిపై సమాచారం అందించాల్సిందిగా కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ కోరారు.


సీతయ్యపేటలో బాలకార్మికుడి వివరాలు నమోదు చేస్తున్న లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముఖ్య నేతలు

యలమంచిలి: మరి కొద్ది మాసాల్లోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతిపక్ష టీడీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. యలమంచిలి మండలం రుక్మిణీపురం గ్రామానికి చెందిన టీడీపీ ప్రధాన నాయకులు వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. గతంలో టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన లాలం లోవరాజు, అతని అనుచరులు దొడ్డి సన్యాసిరావు, గుడే రాజారావు, కోడిబోయిన సంజీవి, లాలం కోటేశ్వరరావు, అల్లాడి అప్పారావు, కరణం నాయుడుతో పాటు మరికొంత మంది ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థ పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు టీడీపీ నేతలు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్కిల్ స్కామ్ కేసులో జైలుకి వెళ్లడంతో ఇప్పటికే దిగాలుపడ్డ యలమంచిలి టీడీపీ శ్రేణులు తాజాగా ఆ పార్టీకి చెందిన రుక్మిణీపురం నేతలు వైఎస్సార్‌సీపీలో చేరడంతో మరింత నిరుత్సాహానికి గురయ్యారు. వైఎస్సార్‌సీపీపై నమ్మకంతోనే ఇతర పార్టీల నేతలు తమ పార్టీలోకి వలస వస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబురాజు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో మరోసారి పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, సేనాపతి రాము, సర్పంచ్‌లు వర్రె నూకినాయుడు, కరణం సత్తిబాబు, స్థానిక పార్టీ నేతలు మర్రి రాజుబాబు, రఘు, జంపాన అచ్యుతరామరాజు తదితరులు పాల్గొన్నారు.


రుక్మిణీపురం టీడీపీ నేతలను కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు


కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో కంటి వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు


అనకాపల్లి ఏఎంసీ కాలనీలోని సీఎం ఆరోగ్య కేంద్రంలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది


కశింకోట మండలం బయ్యవరం శిబిరంలో వృద్ధురాలికి ఆశ కార్యకర్త చేయూత

పేదల పాలిట సంజీవని

జిల్లా అంతటా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కోలాహలంగా జరుగుతున్నాయి. జనం వెల్లువలా వస్తుండగా.. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా టోకెన్లు పంపిణీ చేయడంతో ఈ బృహత్ కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. - సాక్షి న్యూస్ నెట్‌వర్క్

క్రీడా పోటీలకు సై

- నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు
- ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత
- ఉమ్మడి విశాఖ జిల్లాలో సిద్ధమైన వేదికలు



విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 క్రీడా పోటీలకు అంతా సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఈ నెల 13 వరకు జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన నిర్వహించే పాఠశాల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఇదో చక్కని అవకాశం. జిల్లా స్థాయి క్రీడా జట్లు ఎంపిక చేసేందుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనువైన క్రీడా వేదికలను ఎంపిక చేశారు. పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏఏ పోటీలు ఎక్కడంటే..

- బాలబాలికల అథ్లెటిక్స్ సెలక్షన్లు శుక్రవారం విశాలాక్షినగర్‌లోని డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో జరుగుతాయి.
- ఈ నెల 7న అండర్-14 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పరవాడ పోలీసు స్టేషన్ ఎదురుగా జేఆర్‌ఎం కాలనీలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో, అండర్ -17 పోటీలు పరవాడలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు.
- ఈ నెల 8న అండర్-14, 17 బాలబాలికల రోల్‌బాల్ సెలక్షన్లు విశాఖలోని మురళీనగర్‌లో జరుగుతాయి.
- ఈ నెల 9న అండర్-14,17 బాలబాలికల యోగా సెలక్షన్లు పరవాడ ధర్మారాయుడుపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అండర్-17 బాక్సింగ్ సెలక్షన్లు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల సేపక్‌తక్రా సెలక్షన్లు అనకాపల్లి జిల్లా కశింకోటలోని ఏఎస్ పేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అండర్- 14, 17 ఆర్చరీ సెలక్షన్లు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు వ్యాలీ స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 10న అండర్-14 బాలుర బాక్సింగ్ సెలక్షన్లు విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో, అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీలు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని తలారి సింఘిలో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల నెట్‌బాల్ సెలక్షన్లు భీమిలి సన్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. అండర్-14, 17 బాలబాలికల స్కేటింగ్ సెలక్షన్లు విశాఖలోని వీఎంఆర్డీఏ పార్కులో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్‌ఆర్‌జీ జిమ్‌లో నిర్వహించనున్నారు.
- ఈ నెల 11న అండర్-14 బాలబాలికల త్రోబాల్ సెలక్షన్లు విశాఖ జిల్లా కణితి జెడ్పీ హైస్కూల్‌లో, అండర్-14, 17 స్విమ్మింగ్ పోటీలు విశాఖపట్నంలోని రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో జరుగుతాయి. అండర్ -14,17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. అండర్-14, 17 బేస్‌బాల్ పోటీలు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతాయి. పవర్‌లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్‌ఆర్‌జీ జిమ్‌లో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 12న అండర్-14, 17 బాలబాలికల కరాటే పోటీలు నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో, అండర్-17 క్రికెట్ సెలక్షన్లు అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో, అండర్-14, 17 చెస్ సెలక్షన్స్ అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 13న అండర్ -14, 17 బాయ్స్ అండ్ గర్ల్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు అనకాపల్లి జిల్లా పరవాడ దగ్గర తానం ప్రభుత్వ హైస్కూల్‌లో, అండర్-14 క్రికెట్ పోటీలు పెందుర్తి సమీపంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో, అండర్-14, 17 సాఫ్ట్‌బాల్ పోటీలు భీమునిపట్నం జీవీఎంసీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చినపాచిల విద్యార్థులు


ఉదయశ్రీ, యామినిలను అభినందిస్తున్న సిబ్బంది

రావికమతం: కబడ్డీ, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చినపాచిల హైస్కూల్ విద్యార్థినులు వి.యామిని, ఎస్.ఉదయశ్రీలను స్కూల్ హెచ్‌ఎం ప్రసన్నకళ, వ్యాయామ ఉపాధ్యాయుడు కన్నంనాయుడు సహా ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. వీరు బుధ, గురువారాల్లో కణితి, మాకవరపాలెంలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ చూపారు. దీంతో సెలక్షన్ కమిటీ సభ్యులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు స్కూల్ హెచ్‌ఎం తెలిపారు.

బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌ని పరిశీలించిన ఎస్పీ


బుచ్చెయ్యపేట స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధి గ్రామాల్లో క్రైం వివరాల గురించి ఎస్‌ఐ కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి ఫిర్యాదు పట్ల స్పందించి, ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలని సిబ్బందికి హితవుపలికారు.

మనస్థాపంతో ఒకరి ఆత్మహత్య


రాజు మృతదేహం

ఎస్.రాయవరం : వ్యక్తిగత కలహాలు వల్ల ఓ వ్యక్తి ఇంట్లో ఉరి పోసుకుని మృతి చెందినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు గురువారం తెలిపారు. కొరుప్రోలు గ్రామానికి చెందిన బత్తిన రాజు(49) ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడిచిన రాత్రి ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడని చెప్పారు. ఈ మేరకు భార్య రత్నం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. వారం రోజులుగా భార్య ఇంటి వద్ద లేకపోవడం, రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన లోవరాజు అనే వ్యక్తితో మృతుడు రాజు గొడవపడినట్టు చెప్పారు. ఈ గొడవల కారణంగా మనస్థాపంతో మృతి చెందినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద మృతి

కశింకోట : కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ కార్యాలయం వద్ద ఉన్న బంకులో గుర్తు తెలియని డ్రైవర్ అనుమానాస్పద మృతిపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి తమిళనాడులోని సేలంకు రాయి తీసుకెళుతున్న ట్రాలర్ డ్రైవర్ పి.చంద్రశేఖరన్(47) ఇక్కడి బంకులో దాన్ని నిలిపి గదిలో విశ్రాంతికి ఉపక్రమించారు. ఈ సమయంలో స్వీపర్ తుడవడానికి వెళ్లగా ఉలుకూపలుకూ లేకుండా పడి ఉన్న సంగతి గుర్తించి బంకు మేనేజర్ ద్వారపురెడ్డి సోమేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన 108 కు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి డ్రైవర్ మృతి చెందినట్లు తెలిపారు. కారణం తెలియరాలేదు. దీంతో మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి నిరోధకులను నిలదీయండి..

టీడీఆర్‌ల పంపిణీ సభలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసే లక్ష్యంతో తాను పనిచేస్తున్నానని, ఇది చూసి ఓర్వలేని వారు అభివృద్ధికి అడ్డు పడుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్, రైల్వేస్టేషన్ వరకూ రూ.3.50 కోట్ల నిధులతో రహదారి విస్తరణకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. రోడ్డు విస్తరణ పనులకు సహకరించిన స్థానికులకు కృతజ్ఞతలు చెప్పారు. రోడ్డు విస్తరణ సమయంలో స్థలాలు కోల్పోయిన వారికి గతంలో 1:2 పద్ధతిలో నష్ట పరిహారం చెల్లించేవారని, తమ ప్రభుత్వంలో 1: 4 పద్ధతిలో పరిహారం చెల్లిస్తున్నామన్నారు. రూ.2కోట్లతో గృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించామని, 86 మందికి టీడీఆర్లు అందజేశామని అన్నారు. మరోవారం రోజుల్లో మిగిలిన 53 మందికి అందజేస్తామన్నారు. జాతీయ రహదారి తోటాడ జంక్షన్ నుంచి నూకాంబిక అమ్మవారి ఆలయం రహదారి మీదుగా పూల్‌బాగ్ రోడ్డు ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. అగనంపూడి నుంచి అనకాపల్లికి రూ.35 కోట్లతో మంచినీటి తాగునీటి పైప్‌లైను పనులు జరుగుతున్నాయని, కొత్తూరులో రూ.2.5 కోట్లతో పార్కును అభివృద్ధి చేస్తామని వివరించారు. అలాగే పట్టణంలో రూ.20 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని, ఏఎంఏఎల్ కళాశాల నుంచి కూండ్రం వెళ్లే రహదారిలో రూ.3.5 కోట్లతో టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రిని రూ.13 కోట్లతో అభివృద్ధి చేస్తామని, త్వరలోనే సీటీ స్కాన్‌ను కూడా రోగులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. పట్టణ పరిధిలో రూ.550 కోట్లతో మెడికల్ కాలేజీ, ఆస్పత్రిని ఏర్పాటు చేయడానికి అన్ని అనుమతులు తీసుకువస్తే ఆ ప్రాంతానికి చెందిన కొంతమంది కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని, ఇది ఎంతవరకు సమంజం అన్నారు. అభివృద్ధి నిరోధకాలుగా మారినవారిని ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రహదారి విస్తరణలో గృహాలు కోల్పోయిన యజమానులకు టీడీఆర్‌లు మంత్రి అమర్‌నాథ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్పీ ఎస్.వెంకటరమణ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.


పెరుగుబజార్ -గాంధీబొమ్మ జంక్షన్ రహదారి విస్తరణలో గృహాలు కోల్పోయినవారికి టీడీఆర్ పత్రం అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రైతు సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం


ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని కొండల అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రైతులు విత్తనాలు, ఎరువులతోపాటు సాగులో సూచనలు, సలహాలు పొందాలంటే మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సివచ్చేదన్నారు. అలాంటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తేవాలని రైతు భరోసా కేంద్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, మాజీ సర్పంచ్ చిటికెల రమణ, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించితేనే భవిష్యత్

- ఇండియా కూటమి ప్రైవేటీకరణకు వ్యతిరేకం
- స్టీల్‌ప్లాంట్‌తో నాది ఎమోషనల్ అటాచ్‌మెంట్
- ప్లాంట్ రక్షణకు సొంత గనులు కేటాయించాలి
- బహిరంగ సభలో సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి


సంఘీభావం తెలుపుతున్న సీతారాం ఏచూరి, కార్మిక సంఘాల నేతలు

గాజువాక: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశంలో ప్రభుత్వరంగ సంస్థలకు రక్షణ లభిస్తుందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర యాత్ర ముగిసింది. ఈ సందర్భంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ సెక్టార్‌కు ప్రజలే యజమానులని, పాలకులు మేనేజర్లవంటివారని అన్నారు. యజమానులైన ప్రజల అనుమతి లేకుండా దేశ సంపదను మేనేజర్లు అమ్మలేరన్నారు. అలా అమ్మేసే వారిని బాధ్యతలనుంచి తొలగించడమే సరైందన్నారు. మోదీ ప్రభుత్వాన్ని అధికారానికి దూరంగా ఉంచడమే విశాఖ ఉక్కు రక్షణకు పరిష్కారమన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు, అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. రైతులకు అన్యాయం చేసి వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీలకు అప్పగించాలని చూశారన్నారు. రైతుల సుదీర్ఘ పోరాటం చేయడంతో మోదీ వెనకడుగు వేయాల్సి వచ్చిందన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఢిల్లీలో జీ20 సదస్సు కోసం రూ.4,100 కోట్లు ఖర్చు చేసిన మోదీ ప్రభుత్వం రైతులకు మాత్రం అన్యాయం చేస్తోందన్నారు. తన మిత్రులైన కార్పొరేట్‌లకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిన మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మాత్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 10 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను కేటాయించాలని, దీన్ని లాభాల్లో నడిపేందుకు ప్రత్యామ్నాయ చర్యలను ఆలోచించాలని సూచించారు. దేశంలో మతోన్మాద చర్యలు తీవ్రమయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మోదీ అమృత్ కాల్ గురించి మాట్లాడుతుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. 2024లో పెద్ద పెద్ద పోరాటాలు వస్తున్నాయన్నారు. 28 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమితో పీఎస్‌యూలను కాపాడుకోవచ్చని, ఆ కూటమి తరఫున తాను వకాల్తా తీసుకొంటున్నానని అన్నారు. తాము ప్రైవేటీకరణకు వ్యతిరేకమని, పీఎస్‌యూలను కాపాడతామని కూటమి ఇప్పటికే ప్రకటించిందన్నారు. విశాఖ ఉక్కు మన హక్కు అని, ఆ ప్లాంట్‌తో తనకు చిన్నప్పటి నుంచి ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ తోటి కార్మికుల త్యాగ ఫలితాన్ని నిలుపుకోవడం కోసం ఉక్కు కార్మికులు ఐక్యంగా చేస్తున్న పోరాటం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్రజా సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తహతహలాడుతోందని.. కేంద్రం చేస్తున్న పన్నాగాలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు జగ్గునాయుడు, గంగారావు, లోకనాథం, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కె.ఎస్.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఛలో అలంపూర్ పోస్టర్ ఆవిష్కరణ



పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కట్టమూరి మంగరాజు

అనకాపల్లిటౌన్: వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుని ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 7న అలంపూర్ నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కట్టమూరి మంగరాజు అన్నారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో పాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా విభజించాలని, సుమారు 15 ఏళ్లుగా దేశవ్యాప్తంగా పోరాటాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గొటివాడ స్వామ్రాట్‌కుమార్, నాయకులు చెవ్వేటి అప్పారావు, కుందూరు ప్రవీణ్‌కుమార్, పెట్ల ఈశ్వరరావు, ములకలపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

జి.భీమవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

కశింకోట: మండలంలోని జి.భీమవరం సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి గురువారం తెలిపారు. శిబిరానికి ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు హాజరై వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు. అవసరమైన పరీక్షలతోపాటు, మందులు కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేబాకలో జగనన్న ఆరోగ్య సురక్ష రేపు

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మండలంలోని రేబాక గ్రామంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేబాక సచివాలయాల పరిధి రోగులకు వైద్యపరీక్షలు జరిపి, అవసరమైన చికిత్స, మందులు అందిస్తామన్నారు. వైద్యశిబిరంలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. సచివాలయాల పరిధిలో గతంలో టోకెన్లు పొందినవారితో పాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి కూడా వైద్యసేవలు అందిస్తామన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాల్సిందిగా కోరారు.

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 514 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,460	4,460
మొదటి రకం	4,330	4,400
రెండో రకం	4,070	4,250
మూడో రకం	3,800	4,060

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–16 యూనిట్లు, బీ పాజిటివ్–18 యూనిట్లు, ఓ పాజిటివ్–19 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 268 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రజలందరికీ ఆరోగ్య సురక్ష

- 83వ వార్డు సురక్ష శిబిరంలో 1,800 మందికి వైద్య సేవలు
- సత్వర పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ



సురక్షలో రక్త పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎంలు



రోగి సమస్యను అడిగితెలుసుకుంటున్న వైద్యుడు



రోగులకు ఉచితంగా మందులిస్తున్న సిబ్బంది



సురక్ష కార్యక్రమంలో అంగన్‌వాడీల పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక 83వ వార్డులోని 1 నుంచి 8 సచివాలయాల పరిధిలో ప్రజల కోసం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏకంగా 1,800 మంది హాజరై, వివిధ వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్య నిపుణుల సేవలు, ఉచిత మందులు అందుకున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి ఏఎంసీ కాలనీ సీఎం ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీ బీవీ సత్యవతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఏ ప్రభుత్వమూ ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు.

15 రోజులు ముందుగా సచివాలయాల పరిధిలో వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ వివిధ పరీక్షలను నిర్వహించి, ఆ వైద్య సమాచారాన్ని ఆరోగ్య యాప్‌లో నమోదు చేశారు. అనారోగ్య సమస్యలున్నవారికి వైద్య శిబిరానికి హాజరుకావాల్సిందిగా టోకెన్లు అందించారు. ఇలాంటి వారందరికీ ప్రస్తుత వైద్య శిబిరంలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ మేరకు మందులు అందించినట్లు ఎంపీ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటీ 63 లక్షల గృహాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు, తమ అనారోగ్య సమస్యల వల్ల ఆర్థిక దుస్థితిలో కూరుకుపోకుండా మెరుగైన వైద్యం అందించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి సంకల్పించారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌ల ద్వారా నిత్యం ఆయా ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి ఇప్పటికే 5 కాలేజీలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. అప్పటికప్పుడు వైద్యం కోసం వచ్చే రోగులకు అక్కడే ఆన్‌లైన్‌లో స్పాట్ రిజిస్ట్రేషన్ చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. అంతకుముందు రోగులను ఎంపీ బీవీ సత్యవతి పరీక్షించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్సీ ఎస్.వెంకటరమణ, డీటీ వై.శ్రీరామ్మూర్తి, సీఎం ఆరోగ్య కేంద్ర వైద్యురాలు నీరజ, అంగన్‌వాడీ సీడీపీవో ప్రభావతి, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

◆ మండలంలోని మార్టురు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీ బీవీ సత్యవతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న రోగులను దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి, ఆరోగ్యశ్రీలో పూర్తిస్థాయి వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు కొందరు రోగులను ఆమె పరీక్షించారు. పది మందిని కంటి ఆపరేషన్లకు, 103 మందిని మెరుగైన వైద్యానికి రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, వైద్యులు వాణీజగదీశ్వరి, మారుతీరావు, స్పందన, పావని, తుమ్మపాల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బి.సంగం, ఎంఈవో చిట్టిబాబు, సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎంపీటీసీ మిద్దే రామచంద్రరావు, మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద పాల్గొన్నారు.

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు బేషుగ్గా అందుతున్నాయని, ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టి, అమలు చేస్తున్న ఘన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. మండలంలోని బయ్యవరం సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా శిబిరానికి హాజరైన మహిళా రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు సంపూర్ణ ఆరోగాన్ని అందించేందుకే అన్ని సదుపాయాలతో సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలతోపాటు అవసరమైన వారికి పది రకాల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చూపు మందగించిన వారికి పరీక్షలు చేసి కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణుల కోసం ప్రత్యేకంగా మహిళా గైనకాలజిస్టును శిబిరాల్లో ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను సూచించారు. రోగుల్ని వైద్యులు పరీక్షిస్తున్న తీరు, మందుల పంపిణీ, రక్త పరీక్షల నిర్వహణ, స్పాట్ రిజిస్ట్రేషన్ తదితర విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు శిబిరానికి ఎక్కువగా రోగులు హాజరై, పరీక్షలు జరిపించుకున్నారు. వైద్యులు ఎస్.తిరుపతిరావు, కవిత, కోట సునీల్, మనీషా, సిబ్బంది వైద్య సేవలందించారు. డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఎంపీపీ కలగా లక్ష్మి, ఆర్ఈసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ప్రత్యేక అధికారి రోజారాణి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలితో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు



పాప ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



బయ్యవరం:శిబిరానికి వస్తున్న వృద్ధురాలికి తోడు



సురక్షలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యుడు



బాల్యవివాహాల నియంత్రణ పోస్టర్ ఆవిష్కరణ

ఇంత గొప్ప ప్రభుత్వాన్ని నేనెరుగను



నా వయస్సు 72 ఏళ్లు. గతంలో వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాళ్లం. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి చూస్తున్నారు. రక్త పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు ఉచితంగానే అందిస్తున్నారు. ప్రస్తుతం నేను కంటి చూపు మందగించడంతో డాక్టర్లకు చూపించుకున్నా. వైద్యులు పరీక్షలు చేసి కళ్లద్దాలు రాశారు. కళ్లద్దాల్ని కూడా ఉచితంగానే ఇస్తామన్నారు. ఇంతటి గొప్ప ప్రభుత్వాన్ని నేనెరుగను.

– మహాలక్ష్మి, విజయరామరాజుపేట



శిబిరంలో వైద్యులకు సూచనలిస్తున్న ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి



కంటి రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిక్ అధికారి ఆనందరావు



కంటి పరీక్షల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

సత్తెమ్మపేటలో నీటి ముంపునకు చెక్



మట్టితో ఎత్తు చేయిస్తున్న సర్పంచ్ లక్ష్మీరామకృష్ణ

అనకాపల్లిటౌన్: మండలంలోని శంకరం పంచాయతీ శివారు సత్తెమ్మపేట గ్రామంలో లోతట్టు ప్రాంతాలను ఎత్తు చేసేందుకు సుమారు 20 ట్రాక్టర్ లోడుల మట్టిని పోసి, చదును చేసినట్లు సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ తెలిపారు. గురువారం పనులను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ శంకరం గ్రామం మీదుగా జాతీయ రహదారి నిర్మాణంతో సత్తెమ్మపేట గ్రామం లోతట్టు ప్రాంతంగా మారిపోయిందన్నారు. వర్షం పడితే నీరు గ్రామంలో నిలిచి, ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జాతీయ రహదారి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో తమ సొంత నిధులతో వర్షపు నీరు పోయేవిధంగా మట్టి వేసి ఎత్తుచేసినట్లు వెల్లడించారు.

ఘనంగా దుర్గమాంబ ఉత్సవం



మంత్రి అమర్‌నాథ్ దంపతుల్ని గజమాలతో సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు



దుర్గమాంబ సన్నిధిలో ఎంపీ సత్యవతి దంపతులు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో గురువారం దుర్గమాంబ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని వెండి ఆభరణాలు, గజమాలతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తొలి పూజలు నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, దంపతులు, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారికి ఉత్సవ కమిటీ తరపున మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ కలగా లక్ష్మి, సచివాలయ కార్యదర్శి ఎన్.రమేష్ పాల్గొన్నారు. స్థానిక రెల్లి వీధికి చెందిన భక్తులు పసుపు, కుంకుమ, అరటి గెలలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పరసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి చీరలు, రవికెలు, అరటి గెలలు, తల నీలాల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని, అక్కడి నుంచి సంతబయల ఉన్న అమ్మవారి ముఖ ద్వారం వరకు విద్యుద్దీపాలంకరణ చేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. సంతబయల డాన్స్ బేబీ డాన్స్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీఎం దృష్టికి ఏఎంసీ కాలనీ సమస్య

అనకాపల్లిటౌన్: స్థానిక ఏఎంసీ కాలనీలో రాజీవ్ గృహకల్ప భవన సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్త గృహాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ బీవీ సత్యవతికి వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను గురువారం కలిసి, సమస్యను నివేదించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఇక్కడి ప్రజల దుస్థితిని తెలుసుకుని 2007లో ఏఎంసీ కాలనీలో రాజీవ్ గృహకల్ప కాలనీ నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ సుమారు వెయ్యి మంది నివసిస్తున్నారన్నారు. కాలనీ నిర్మాణాలు శిథిలావస్థకు చేరి, శ్లాబ్ పెచ్చులూడి ఇళ్లల్లో ఉన్నవారు భయాందోళనకు గురవుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : మునగపాకలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పాడి పెంపకంతో రైతులకు ఆర్థిక పరిపుష్టి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో రామ్మోహన్‌రావు



పోటీలో బహుమతులు పొందిన లేగ దూడలు

కశింకోట: పశుపోషణలో లేగ దూడల పెంపకంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని డీఎల్‌డీవో అధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని నరసింగబిల్లి గ్రామంలో గురువారం లేగ దూడల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలో రవిప్రసాద్, దండిన రాము, దండిన సత్తిబాబుల దూడలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించిన పోటీల్లో 40 దూడలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ఆల్ఫాన్స్ జార్జ్, చైతన్యమణి, సుమతీ రాణి, సర్పంచ్ కోన అరుణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమినాయుడు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కోన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో మహిళలకు ఆర్థిక స్వావలంబన



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

కశింకోట:మహిళలు ఆర్థిక స్వావలంబనకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జాతీయ జీవనోపాధుల విభాగం ద్వారా రెండో విడత విజన్ బిల్డింగ్‌పై స్వయం సహాయక సంఘాల మహిళలకు మూడు రోజుల పాటు జరిగే మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మహిళల అభివృద్ధి, కలల సాకారానికి నైపుణ్యాలను పెంచుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ వై.ధర్మారావు, సమాఖ్య అధ్యక్షురాలు వి.లక్ష్మి, కార్యదర్శి వి.నాగలక్ష్మి, కోశాధికారి జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లిటౌన్: కరోనా సమయంలో వృద్ధులకు నిలిపేసిన ప్రభుత్వ రాయితీలను వెంటనే పునరుద్ధరించాలని అనకాపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల కృష్ణఅప్పారావు కోరారు. గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు నెలకు రూ.5 వేల పింఛన్, రైలు ప్రయాణంలో రాయితీ, పట్టణ పరిధిలో వృద్ధుల సమావేశాలకు కమ్యూనిటీ హాలు నిర్మాణం తదితర డిమాండ్లను పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ప్రభుత్వంచే గుర్తింపు కార్డులు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు, అసోసియేషన్ సభ్యులు ఎంఎస్ఎస్ అప్పారావు, రమేష్, బి.తాతారావు, శ్రీరాములు, నాయుడు, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కండక్టర్ మార్పు, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసింగబిల్లి, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, గొబ్బూరు, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

146 మందికి ఉచిత కంటి పరీక్షలు

మునగపాక : తిమ్మరాజుపేటలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక సత్యసాయిబాబా ఆలయ ప్రాంగణంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన శిబిరానికి 146 మంది రోగులు హాజరయ్యారు. వారిలో 33 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ అధికారి వరహాలు, ఫౌండేషన్ క్యాంపు డీఎం అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిమజ్జనోత్సవాలు



సీఐ మోహన్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జనోత్సవాలను నిర్వహించాలని పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అన్నారు. గవరపాలెం బొచ్చావారివీధిలో ఏ1 కింగ్స్ ఏర్పాటు చేసిన గణపతిని గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీఐను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వినాయక మందిర కమిటీ సభ్యులు మళ్ల జగ్గప్పారావు, మద్దాల కృష్ణారావు, ముదుర్తి భాను, కాండ్రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నేస్తాలమ్మ పండగ



నేస్తాలమ్మ అమ్మవారు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. పండగను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నేస్తాలమ్మను వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామ పెద్దలు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాడచీపురుపల్లి సతకంపట్టు నుంచి నేస్తాలమ్మను డప్పులు, చిడతలు, భజనలు, కోలాటాలు, కోయ డ్యాన్సులు, తప్పెటగుళ్ల మధ్య గ్రామ పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. రాత్రికి అమ్మవారి అనుపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.